

RNI.NO. APTEL/26/A2902

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక
"అతికొద్ది కాలంలోనే అత్యధిక ప్రజాదరణ పొందిన"
"గ్లోబల్ వార్త" జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
అన్నమయ్య జిల్లాలోని నియోజకవర్గాల్లో
రాయచోటి,
రాజంపేట, రైల్వేకోడూరు,
మదనపల్లి, పీలేరు,
తంబళ్ళపల్లి, పుంగనూరు
విలేకరులు కావలెను
వివరాలకు కింద ఉన్న ఫోన్ నెంబర్‌ను సంప్రదించండి.
ఫోన్ నెంబర్స్ - 7093627232, 9392480345, 08562-461571
MAIL ID : globalvarthaindia@gmail.com

సంపుటి 1 | సంచిక 58 | 30-10-2026 | శుక్రవారం | పేజీలు -4 | వెల-రూ. 5

నీట్ పేపర్ లీకేజీ కేసు..
14 మంది నిందితులపై తీర్పు రిజర్వ్ చేసిన కోర్టు!



గ్లోబల్ వార్త - న్యూఢిల్లీ

నీట్ యూజీ పేపర్ లీకేజీ కేసులో ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. 14 మంది నిందితులపై నేరాభియోగాలు ఖరారు చేసే అంశంపై విచారణ పూర్తి చేసి తీర్పును రిజర్వ్ చేసింది. నవంబర్ 18న తీర్పు వెలువరించనుంది. దేశవ్యాప్తంగా కలకలం రేపిన 'నీట్ యూజీ' పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు కీలక పురోగతి సాధించింది. ఈ కేసులోని 14 మంది నిందితులపై నేరాభియోగాలు ఖరారు చేసే అంశంపై విచారణ పూర్తి చేసిన న్యాయస్థానం తన తీర్పును రిజర్వ్ చేసింది. నిందితులపై ఏయే విభాగాల కింద చార్జీలు మోపాలో నిర్ణయిస్తూ నవంబర్ 18న రౌజ్ అవెన్యూ కోర్టు తీర్పును వెలువరించనుంది.

సీబీఐ విచారణ.. ఛార్జ్‌షీట్‌ల సమర్పణ

కేసు నమోదు: మే 2026లో ఈ పేపర్ లీకేజీ ఘటనపై సీబీఐ కేసు నమోదు చేసి అత్యంత వేగవంతంగా విచారణ పూర్తి చేసింది.

తొలి ఛార్జ్‌షీట్: జూలై 2026లో సీబీఐ 13 మంది నిందితుల పేర్లతో మొదటి ఛార్జ్‌షీట్‌ను సమర్పించింది.

అనుబంధ ఛార్జ్‌షీట్: తదనంతరం దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్‌లో 14వ నిందితుడిగా శేషారావు బజరంగ్ సూర్యవంశీ పేరును చేర్చింది.

కోర్టు పరిగణన: ఆగస్టు 2026లో సీబీఐ సమర్పించిన ప్రధాన ఛార్జ్‌షీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకుని విచారణ జరిపింది. వైద్యవిద్య ప్రవేశాల సమగ్రతను దెబ్బతీసిన ఈ లీకేజీ కుట్రలో పాల్గొన్న 14 మంది ప్రధాన నిందితులపై విచారణను వేగవంతం చేస్తూ, నేరారోపణల ఖరారుపై రౌజ్ అవెన్యూ కోర్టు నవంబర్ 18న తన తుది ఉత్తర్వులను ప్రకటించనుంది.

నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల
46.85 లక్షల రైతు కుటుంబాలకు లబ్ధి



గ్లోబల్ వార్త - అమరావతి : అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ రెండో విడత నిధులు శుక్రవారం విడుదలకానున్నాయి. ఈ మేరకు ఏపీ కేబినెట్‌లో నిధుల విడుదలకు నిర్ణయం తీసుకున్నారు. రబీ రైతుల కోసం అనుకున్న సమయానికంటే ముందుగా పీఎం కిసాన్ నిధులు విడుదల చేయాలని కేంద్రం నిర్ణయించింది. పీఎం కిసాన్ నిధులు విడుదల చేస్తున్న సందర్భంగా రేపే అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో రెండో విడత కింద అక్టోబర్ 30న అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం నిధులను ఏపీ ప్రభుత్వం విడుదల చేయనుంది. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 రైతు కుటుంబాలకు రూ.3,125 కోట్ల ఆర్థిక సాయం అందనుంది. అన్నదాత సుఖీభవ 2026-27 సంవత్సరానికి 2వ విడతలో ప్రతి రైతు కుటుంబానికి రూ.7,000 సాయం అందించనున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.5,000, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా వాటాగా రూ.2,000 ఇవ్వనున్నారు. ఈ విడత విడుదల మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2,342.92 కోట్లు, పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.782.55 కోట్లు రైతుల కుటుంబాలకు అందజేయనున్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ ద్వారా అర్హులైన రైతు కుటుంబాలకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయాన్ని కూటమి ప్రభుత్వం అందిస్తోంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.14,000, కేంద్ర ప్రభుత్వం రూ.6,000 వాటాగా చెల్లిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడతను 20 జూన్ 2026న విడుదల చేశారు. ఈ ఏడాది మొదటి విడతలో 46,85,838 రైతు కుటుంబాలకు రూ.3,125.47 కోట్ల సాయాన్ని అందించారు. గతేడాది ఆగస్ట్ 2న ప్రారంభించిన ఈ పథకం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం, రాష్ట్ర వాటా కలిపి రూ.8,985.41 కోట్లను రైతులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నదాత సుఖీభవ పథకం కింద రేపటి విడతతో కలిపి ఇప్పటివరకు మొత్తం రూ.15,236.35 కోట్లు రైతు కుటుంబాలకు అందజేయగా.. ఇందులో రాష్ట్ర వాటా రూ.11,246.02 కోట్లు, కేంద్రం వాటాగా రూ.3,990.33 కోట్లు అందజేశారు.

సముద్రంలో చిక్కుకున్న వాణిజ్య నౌక..
13 మంది సురక్షితం, మరో ఏడుగురి కోసం రెస్క్యూ

బంగాళాఖాతంలో ఆర్నాబ్ తుఫాన్ బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. తుఫాన్ కారణంగా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఫిలిప్పీన్స్‌కు చెందిన ఓ వాణిజ్య నౌక అంతర్వేది సమీపంలోని సముద్రంలో చిక్కుకుంది. విశాఖపట్నం నుంచి సింగపూర్‌కు వెళ్తున్న ఈ నౌక ప్రతికూల సముద్ర పరిస్థితుల కారణంగా ముందుకు సాగలేక నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ఇండియన్ కోస్ట్ గార్డ్ సహాయక చర్యలు చేపట్టింది. నౌకలో చిక్కుకున్న సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు రెస్క్యూ ఆపరేషన్‌ను ముమ్మరం చేసింది. హెలికాప్టర్ల ద్వారా రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, సముద్రంలో ఉన్న కోస్ట్ గార్డ్ సిబ్బంది కూడా రంగంలోకి దిగారు. ఇప్పటివరకు 13 మందిని సురక్షితంగా రక్షించి, ఇండియన్ కోస్ట్ గార్డ్ నౌక సుజయ్ (ాఖజీూ)లోకి తరలించారు. మరో ఏడుగురు ఇంకా వాణిజ్య నౌకలోనే ఉండగా.. వారినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. మరోవైపు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కోస్ట్ గార్డ్ అధికారులు సహాయక చర్యలను సమన్వయం చేస్తున్నారు. నౌకలో చిక్కుకున్న మిగిలిన ఏడుగురినీ సురక్షితంగా రక్షించడమే లక్ష్యంగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో మిగిలిన సిబ్బంది రక్షణపై ఉత్కంఠ నెలకొంది.

గోనెగండ్లలో రాజకీయ ప్రకంపనలు
చిన్నమర్రివీడులో వైసీపీకి ఎదురుదెబ్బ.. టీడీపీ గూటికి 80 మంది!

గ్లోబల్ వార్త - కర్నూలు జిల్లా:

స్థానిక రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. గోనెగండ్ల మండలం చిన్నమర్రివీడు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, వారి అనుచరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ సర్పంచి బోయ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ బసప్ప సహా పలువురు నేతలు, సుమారు 80 మంది అనుచరులు గురువారం ఎమ్మెల్యే డా. బీవీ జయ నాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీపై అసంతృప్తి, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఈ చేరికలు టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు పూర్తి మద్దతు అందిస్తామని పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు తెలిపారు. అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించేలా కృషి చేస్తామని ప్రకటించారు. చిన్నమర్రివీడులో చోటుచేసుకున్న ఈ రాజకీయ పరిణామం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల ప్రచారం ఊపందుకుంటున్న సమయంలో వైసీపీ నాయకులు టీడీపీలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



నేటి నుండి రెండు రోజులపాటు మున్సిపల్ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్
ఎన్నికల సిబ్బంది, దూర ప్రాంతాల ఓటర్ల కోసం ప్రత్యేక సౌకర్యం

గ్లోబల్ వార్త - పులివెందుల

కడప జిల్లా పులివెందులలో మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు నేటి నుండి రెండు రోజులపాటు ఎన్నికల అధికారులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. పులివెందుల పట్టణంలోని అహోబిలాపురం జెడ్పీహెచ్ హైస్కూల్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎన్నికలు జరుగుతున్న 20 వార్డులకు సంబంధించి ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు ఈ ఏర్పాట్లు చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను పోలీసు భద్రత మధ్య నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సును సిద్ధం చేశారు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి వార్డుకు ఒక రిటర్నింగ్ అధికారి ఇద్దరు సహాయకులను నియమించారు.

ఆర్నబ్ తుఫాన్ నష్టపరిహారంపై
చంద్రబాబు కీలక ఆదేశాలు



గ్లోబల్ వార్త -అమరావతి : ఆర్నబ్ తుఫాన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురు వారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సాధారణ పరిస్థితి నెలకొనేంత వరకు విశ్రమించొద్దని ఇప్పటికే అధికార యంత్రాంగానికి సీఎం సూచనలు చేశారు. కొన్ని ప్రాంతాలు మినహా మిగిలిన తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ స్థితి నెలకొంది. ఈ క్రమంలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులు, పునరుద్ధరణ పనులపై వివిధ శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుఫాన్ నష్టంపై ఇవాళ ప్రాథమిక నివేదికను అందిస్తామని చంద్రబాబుకు అధికారులు తెలిపారు. పంట నష్టం మినహా బాధితులందరికీ నష్టపరిహారాన్ని అందించే పనిని వేగవంతం చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.అధికార యంత్రాంగం పనితీరు అద్భుతం..ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అండగా ఉండాలని సీఎం తెలిపారు. ఆర్నబ్ తుఫాన్ సమయంలో అధికార యంత్రాంగం అద్భుతంగా పని చేసిందని కొనియాడారు. ఏపీలో ప్రస్తుతం విభిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని.. రాయలసీమ ప్రాంతంలో ఎల్‌నినో ప్రభావంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఇక మిగిలిన ప్రాంతాల్లో ఆర్నబ్ తుఫాన్ వల్ల సమస్యలు ఉత్పన్నమైనట్లు తెలిపారు. ఈ రెండింటి విషయంలో అధికార యంత్రాంగం సమర్థవంతంగా వ్యవహరించి ప్రజలను ఆదుకోవాలని ఆదేశించారు. రాయలసీమలో పంటలు వేసుకునే పరిస్థితి లేదని అన్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా, గోదావరి జిల్లాల్లో వేసుకున్న పంటలను, కొబ్బరి చెట్లను నష్టపోయిన దుస్థితి నెలకొందన్నారు. పక్కా ప్రణాళికతో ఈ ప్రకృతి విపత్తుల బారి నుంచి ప్రజలను బయటపడేయాలని తెలిపారు. ఆర్నబ్ తుఫాన్ వల్ల ప్రాణ, ఆస్తి నష్టం వీలైనంత మేర తగ్గించేలా చూశామని చెప్పుకొచ్చారు. చెరువులు, కాల్వలకు గండ్లు పడకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పడిపోయిన చెట్లను ఇప్పటికే చాలా వరకు తొలగించామని.. ఇంకా ఎక్కడైనా పడిపోయిన చెట్లు రోడ్లపై ఉంటే వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు.


రేపటిలోగా విద్యుత్ పునరుద్ధరణ..

తుఫాన్ కారణంగా పోగైన చెత్తను కూడా తీసేయాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. రేపటిలోగా అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలన్నారు.

తరువాయి 2లో

త్వరలోనే బాధిత రాష్ట్రాలకు కేంద్ర బృందాలు

తుఫాన్ ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సీఎంలతో 'సైక్లోన్ ఆర్నబ్' పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. కేంద్రం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి హామీ ఇచ్చారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయన్నారు. యుద్ధప్రాతిపదికన సహాయ, పునరావాస చర్యలు కొనసాగుతున్నాయని అమిత్ షా తెలిపారు. నష్ట తీవ్రతను అంచనా వేసేందుకు త్వరలోనే తుఫాన్ ప్రభావిత రాష్ట్రాలకు కేంద్ర బృందాలు రానున్నట్లు చెప్పారు. ప్రకృతి విపత్తు వేళ బాధితులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. ఇప్పటికే ఏపీ లో ఆర్నబ్ తుఫాన్ ఎఫెక్ట్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు నాయుడు లేఖ రాయడంతో పాటు ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే. తుఫాన్ కారణంగా రాష్ట్రంలో పంటలు, ఇళ్లు, రహదారులు, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నట్లు తెలిపారు. తుఫాన్ ప్రభావంతో ఆస్తి, ప్రాణ నష్టం కలగకుండా తీసుకున్న ముందస్తు చర్యలను వివరించారు.




త్వరితగతిన తుఫాన్ నష్టంపై అంచనాకు కేంద్ర బృందాలను పంపాలని సీఎం చంద్రబాబు కోరారు.

ఆర్నబ్ తుఫాన్ వేళ నిద్రాహారాలు మాని పనిచేశారు
మంత్రి లోకేశ్ ప్రశంసలు

గ్లోబల్ వార్త - అమరావతి

పీలో ఆర్నబ్ తుఫాన్ పెను బీభత్సం సృష్టించింది. తుఫాన్ తీరం దాటే సమయంలో పెనుగాలులు వీచడంతో ఎక్కడికక్కడ భారీ చెట్లు నేలకొరిగాయి. తుఫాన్ ప్రభావంతో అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో జనజీవనం స్తంభించింది. అయితే తుఫాన్ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి అప్రమత్తమై వేగంగా సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఏపీలో ఆర్నబ్ తుఫాన్ బీభత్సం, అధికార యంత్రాంగం సహాయక చర్యలపై మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్'వేదికగా స్పందించారు. సహాయక చర్యల్లో పాల్గొన్న కార్మికులు, అధికారులు, టీడీపీ నేతలు, కార్యకర్తలను ప్రశంసించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో రాష్ట్రంలో అస్తవ్యస్థ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అధికార యంత్రాంగం నిద్రాహారా లు మాని సాధారణ పరిస్థితికి తీసుకొచ్చినట్లు మంత్రి చెప్పుకొచ్చారు. ఆర్నబ్ తుఫాన్ బీభత్సం సృష్టించి వెళ్ళింది. పల్లెలు, పట్టణాలు, నగరాలు తుఫాన్ తీరం దాటే సమయంలో అస్తవ్యస్త మయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు, సిబ్బంది, అధికార యంత్రాంగం, టీడీనీ నేతలు, కార్య కర్తలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాధారణ పరిస్థితి తీసుకొచ్చేందుకు నిద్రా హారాలు మాని పని చేశారు. ప్రకృతి విపత్తు వేళ అంతా కలిసి జన జీవనానికి ఎటువంటి ఆటంకం లేకుండా చేయడం.. సమష్టి తత్వానికి, సేవాస్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తోంది' అంటూ ఎక్స్‌లో



తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మరంగా పునరుద్ధరణ పనులు : మంత్రి నారాయణ

గ్లోబల్ వార్త - అమరావతి : రాష్ట్రంలో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పట్టణాల్లో పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. తుఫాను అనంతర పరిస్థితులపై మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ అధికారులతో ఉన్నత స్థాయి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈసీ ప్రభాకర్ సహా పలువురు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టం వివరాలను మంత్రి నారాయణ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని 8 జిల్లాల పరిధిలోని 10 మున్సిపాలిటీల్లోని 85 ప్రాంతాలు తుఫాను వల్ల తీవ్రంగా ప్రభావితమైనట్లు అధికారులు మంత్రికి వివరించారు. అయితే, ప్రభుత్వ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన స్పందించి ఇప్పటివరకు ఏడు మున్సిపాలిటీల పరిధిలోని 71 ప్రాంతాల్లో జనజీవనాన్ని పూర్తిగా సాధారణ స్థితికి తీసుకువచ్చినట్లు తెలిపారు. రోడ్లపై అడ్డంగా పడిన చెట్లు, కూలిపోయిన విద్యుత్ స్తంభాలను ఇప్పటికే పూర్తిగా తొలగించి రాకపోకలను పునరుద్ధరించినట్లు అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జనరేటర్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నీటిని సరఫరా చేస్తున్నామని వివరించారు. ఈ నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణపై అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మంత్రి నారాయణ గట్టిగా ఆదేశించారు.



ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని సూచించారు. అలాగే ఇవాళ వీధి దీపాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని మున్సిపల్ కమిషనర్లను మంత్రి ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఆయన స్పష్టం చేశారు.

'ఫ్రైడే - డ్రైడే' పాటించి దోమల రహిత సమాజాన్ని నిర్మిద్దాం

సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య



గ్లోబల్ వార్త - పులివెందుల

దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ ప్రతి వారం శుక్రవారం తప్పనిసరిగా 'డ్రై డే' పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దోమ గుడ్డు దశ నుంచి పూర్తి స్థాయి దోమగా మార డానికి దాదాపు 7 నుండి 10 రోజుల సమయం పడుతుందన్నారు. అందుకే వారానికి ఒకరోజు శుక్రవారం ఇంటి లోపల, బయట నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేసి ఆరబెట్టడం ద్వారా దోమల జీవిత చక్రాన్ని లార్వా దశలోనే అడ్డుకోవచ్చని తెలిపారు.

ఫ్రైడే - డ్రైడే పాటించడం వల్ల కలిగే ఉపయోగాలు:

దోమల ఉత్పత్తికి చెక్: నిల్వ ఉన్న నీటిలోనే దోమలు గుడ్లు పెడతాయి. నీటి పాత్రలను ఖాళీ చేసి, బాగా రుద్ది కడిగి ఆరబెట్టడం వల్ల దోమల గుడ్లు, లార్వాలు నశిస్తాయి. భయంకర వ్యాధుల నుండి రక్షణ: డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి ప్రమాదకర వ్యాధులు వ్యాప్తి చెందకుండా కాపాడుకోవచ్చు. హాస్పిటల్ ఖర్చులు ఆదా: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండటం వల్ల అనవసర వైద్య ఖర్చులు తగ్గి కుటుంబ ఆరోగ్యం సురక్షితంగా ఉంటుంది. పరిసరాల పరిశుభ్రత: వారానికోసారి ఇల్లు, పరి సరాలను శుభ్రం చేసుకోవడం వల్ల పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుంది.

సామూహిక ఆరోగ్యం: గ్రామంలో లేదా కాలనీలో ప్రతిఒక్కరూ తమ ఇళ్లలో డ్రైడే పాటించడం వల్ల దోమల సంఖ్య గణనీయంగా తగ్గి అందరికీ ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుంది.

డ్రై డే రోజున చేయాల్సిన పనులు:

కూలర్లు, డ్రమ్ములు: కూలర్లు, నీటి తొట్లు, డ్రమ్ములలోని పాత నీటిని పూర్తిగా పారబోసి, బాగా రుద్ది కడిగి పొడిగా ఆరబెట్టాలి.

పాత్రలు ఉ కుండీలు: పూల కుండీల కింద ఉండే ప్లేట్లు, ప్లాస్టిక్ కప్పులు, పాత టైర్లు, కొబ్బరి బొండాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. వాటర్ ట్యాంకులు: ఇంటి పైన ఉండే ఓవర్ హెడ్ ట్యాంకులు, నీటి డ్రమ్ములపై మూతలు గట్టిగా ఉంచాలి.

మురుగు నీటి నివారణ: ప్రవహించని మురికి నీటిపై లేదా నిల్వ ఉన్న నీటి గుంతలపై వాడిన ఇంజన్ ఆయిల్ లేదా కిరోసిన్ చల్లాలి. ఇది నీటిపై పొరలా ఏర్పడి లార్వాలకు ఆక్సిజన్ అందకుండా చేసి వాటిని చంపేస్తుంది. ప్రతి ఒక్కరూ "ప్రతి శుక్రవారం - డ్రై డే" ను ఒక బాధ్యతగా గుర్తుంచుకొని పాటించి, దోమల రహిత సమాజాన్ని నిర్మించడంలో భాగస్వాములు కావాలని సిద్దయ్య కోరారు.

భక్తిశ్రద్ధలతో శిరిడి సాయినాథునికి విశేష పూజలు

ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు



గ్లోబల్ వార్త - పులివెందుల

పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలో మొట్టమొదటిగా కొలువైన శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం షిరిడి సాయిబాబా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయాస్తమాన స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో సాయి నాథునికి ఉదయం కాగడ హారతి, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి, తదితర పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు . మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్నం హారతి సాయంకాలం 6 గంటలకు సంధ్య హారతి రాత్రి 9 గంటలకు శేజ హారతులు స్వామి వారికి అర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు విశేషంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగం గా ప్రతి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతోందని తెలియ జేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు

అనంతపురం జిల్లాలో విషాదం

రైల్వే ట్రాక్‌పై రెండు ఎలుగుబంటి పిల్లల మృతి



గ్లోబల్ వార్త- అనంతపురం జిల్లా

అనంతపురం జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. డి.హిరేహాల్ మండలం కల్యం గ్రామ సమీపంలో రైలు ఢీకొనడంతో రెండు ఎలుగుబంటి పిల్లలు మృతి చెందాయి. గురువారం రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. తల్లి ఎలుగు బంటితో కలిసి పిల్లలు ట్రాక్ దాటు తుండగా రైలు ఢీకొని ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందు కున్న అటవీశాఖ అధికారులు వెంటనే సంఘ టనా స్థలానికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితు లను పరిశీలించి, ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. అడవి జంతువులు రైల్వే ట్రాక్‌లు దాటే సమయంలో ప్రమాదాలకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనకు సంబంధించి అటవీశాఖ అధికారుల విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



డివిజన్లలో హోరెత్తుతున్న ప్రచారం..

ఓటర్లను ఆకట్టుకునేందుకు పార్టీల ఎత్తుగడలు!

కూటమి, వైసీపీ మధ్య హోరాహోరీ ప్రచారం.. రంగంలోకి సోము వీర్రాజు

గ్లోబల్ వార్త -అనంతపురం:

ఎన్నికల ప్రచారానికి గడువు సమీపిస్తుండటంతో అనంతపురంలో రాజకీయ వేడి పెరిగింది. చివరి రెండు రోజులు మిగిలి ఉండటంతో ప్రధాన పార్టీలైన కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. డివిజన్ల వారీగా పర్యటిస్తూ ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇరు పార్టీల నాయకులు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కూటమి తరఫున ప్రచారాన్ని మరింత వేగవంతం చేసేందుకు బీజేపీ నేత సోము వీర్రాజును రంగంలోకి దించింది. మరోవైపు వైసీపీ కూడా దీటుగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వైసీపీ మేయర్ అభ్యర్థి బీసీ రమేష్ గౌడ్‌తో కలిసి మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి వివిధ డివిజన్లలో పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారు. ప్రచార గడువు ముగియడానికి సమయం తక్కువగా ఉండటంతో నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకుంటూ తమ అభ్యర్థులకు మద్దతు కోరుతున్నారు. దీంతో నగరంలోని పలు డివిజన్లలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. చివరి రెండు రోజుల ప్రచా రంలో ప్రధాన పార్టీలు అనుసరించే వ్యూహాలు, నిర్వహించే కార్యక్రమాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

ఎన్నికల నేపథ్యంలో వెంకయ్య కాలువ గ్రామంలో గ్రామసభ

మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన పోలీసులు

కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఆదేశాల మేరకు, కొండాపురం ఎస్.ఐ. సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి కొండాపురం మండలంలోని వెంకయ్య కాలువ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్యాంశాలు:

రాబోయే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి, ఆపద సమయాల్లో సంప్రదించాల్సిన అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ల గురించి వివరించారు.

ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకు గ్రామంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు.

ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని, సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.



ఫ్యాన్ గుర్తుపై ఓటేసి బండి దీప్తిని గెలిపించండి

ఎస్.బి. అంజాద్ భాష

గ్లోబల్ వార్త - కడప

కడప నగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి బండి దీప్తి గారికి మద్దతుగా మాజీ డిప్యూటీ సీఎం, కడప నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.బి. అంజాద్ భాష గారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈరోజు కడప నగరంలోని కడప నగరంలోని 48,49,50వ డివిజన్లలో ఇంటర్నేషనల్ కళ్యాణమండపం, కేసీ కెనాల్ కట్ట, అగాడి వీధి, యానాది కాలనీ, బిస్మిల్లా నగర్ నందు ఎన్నికల ప్రచారం చేపటా రు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను, ఓటర్లను కలుసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి బండి దీప్తి గారిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి బండి దీప్తి గారిని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరుతున్నాం. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష మాట్లాడుతూ, కడప నగరంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటే ప్రజల చేతిలో ఉన్న శక్తివంతమైన ఆయుధమని, ఎన్నికల్లో తమ ఓటు ద్వారా ప్రజలే తగిన సమాధానం చెబుతా రని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ, కడప నగర అభివృద్ధి మరియు ప్రజల సంక్షేమం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి దీప్తి గారిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుభాన్ భాష,నార్త్ జోన్ అధ్యక్షులు బిహెచ్ఇలియాజ్ మాజీ కార్పొరేటర్లు మహమ్మద్ రఫీ, బసవరాజు, మక్బూల్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఇబ్రహీం మియా, మాజీ వక్ఫ్ బోర్డ్ వైస్ చైర్మన్ రిజ్వాన్, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి జోఫలా,నాయకులు అతావుల,చాన్ అలీ, మున్నా యాసర్ ఇమ్రాన్, రహమత్, ఆబిద్ మియా మల్లికార్జున రెడ్డి, పేట నాగరాజు, సమీర్, షబ్బీర్,తదితరులు పాల్గొన్నారు.



నంద్యాల వరదరాజు రెడ్డి రాచమలుపై ఆగ్రహం

గ్లోబల్ వార్త - ప్రొద్దుటూరు

జగన్మోహన్ రెడ్డికి , రాచమల్లుకు పుట్టగతులు లేవు. ఏకగ్రీవాలు చేసుకోమని మా వాళ్ళను ప్రోత్సహించింది రాచమల్లు రాచమల్లు కు సంస్కారం లేదు. మా పార్టీ కౌన్సిలర్ల పై చేయి వేసే ధైర్యం ఉందా రాచమల్లుకు... అక్ర మంగా సంపాదించిన డబ్బు వందల కోట్లు రాచ మల్లు ప్రజలకు పంచాలి ... జగనన్న కాలనీల్లో ప్రజలు సొమ్ము దోచుకున్న రాచమల్లు ప్రజలతో మీ ఇంటి ముందు ధర్నా చేయిస్తా...రాచమల్లు , వైఎస్ ఆర్ పార్టీ , ఆ పార్టీ నాయకుడు జగన్ ఇంకా కనుమరుగే ... సొంత చెల్లి కుమార్తె పెళ్ళి ని అడ్డుకుంటున్న నీచుడు జగన్... అహంకార పూరితంగా రాచమల్లు మాట్లాడుతున్నాడు రాచమల్లు ను ప్రొద్దుటూరు ప్రజలు తిరస్కరించారు... వందల కోట్లు రాచమల్లు , ఆయన బావుమరిది దోచు కున్నారు... జగన్ సొంత ఊరు బలుప నూరులో టీడీపీ గెలుచు కున్నా రు... ఇక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లేదు... జగన్మోహన్ రెడ్డికే గతి లేదు... పులివెందులలో కౌన్సిలర్ల కు నామినేషన్లు వేసే దిక్కు వైఎస్ఆర్ పార్టీకి లేక ఏకగ్రీవాలయ్యాయి మరి మీ నాయకుడు జగన్ ఎక్కడ పడు కున్నాడు... 2029కి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని జీరో చేస్తాం ...ప్రొద్దుటూరు మండ లంలో ఒక్క టీడీపీ నాయకుడు , కార్యకర్త పైన రాచమల్లు చేయి వేస్తే అప్పుడు తెలుస్తుంది.. రాచమల్లు భాష, మాట్లాడుతున్న తీరు చూసే ప్రజలు బాధపడుతున్నారు... ఇలాంటి వారికి ఓట్లు వేశామా అని ప్రజలు అనుకుం టున్నారు... ప్రెస్ మీట్ లో ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ లక్ష్మణ్, టిడిపి మండల నాయకులు శంకరాపురం ప్రసాద్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, గురివి రెడ్డి పాల్గొన్నారు.



మన లక్ష్యం ప్రజా సంక్షేమం... మన సంకల్పం గ్రామాల అభివృద్ధి!

జెడ్పీటీసీ అభ్యర్థి బొగ్గుల విజయలక్ష్మి ఇంటింటి ప్రచారం

గ్లోబల్ వార్త - వేముల

వేముల మండల పరిధిలోని మీది పెండ్ల, భూమయ్యగారిపల్లి, రాచుకుంటపల్లి గ్రామాల్లో జెడ్పీటీసీ అభ్యర్థి బొగ్గుల విజయలక్ష్మి కి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధి రెడ్డి, పేర్ల శేషారెడ్డి, గ్రామ నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజలను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని, ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని హామీ కల్పిస్తూ,మన లక్ష్యం ప్రజా సంక్షేమం మన సంకల్పం గ్రామాల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి చెందుతుందని గ్రామ ప్రజలకు తెలియజేస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటా ప్రచారంలో అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

7న మద్యం దుకాణాలను మూసివేయాలి

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

గ్లోబల్ వార్త - పుట్టపర్తి



శ్రీ సత్యసాయి జిల్లాలో జడ్పిటిసి మరియు ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో, ఎన్నికలు జరిగే సంబంధిత పోలింగ్ ప్రాంతాల పరిధిలో మద్యం దుకాణాలను మూసివేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల ప్రకారం, 2026 నవంబర్ 05వ తేదీన పోలింగ్ ముగిసే సమయానికి ముందు 48 గంటల పాటు, అంటే నవంబర్ 03వ తేదీ సాయంత్రం 05 గంటల నుండి నుంచి నవంబర్ 05 తేదీ సాయంత్రం 05 గంటల వరకు సంబంధిత పోలింగ్ ప్రాంతాల్లో మద్యం దుకాణాలు మూసివేయాలి. ఓట్ల లెక్కింపు జరిగే రోజున (నవంబర్ 7న) కూడా సంబంధిత ప్రాంతాల్లో మద్యం దుకాణాలు మూసివేయాల్సి ఉంటుంది. సంబంధిత ప్రాంతాల్లోని మద్యం దుకాణాల నిర్వాహకులు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా సహకరించాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం సూచించింది.

అర్నబ్ తుపాను నష్టపరిహారంపై...

(మొదటి పేజీ తరువాయి)

నష్ట పరిహారానికి సంబంధించిన అంశాలపై జీవో జారీ చేశామని.. పంట నష్టం మినహా బాధితులకు నష్టపరిహారం అందించాలని తెలిపారు. త్వరగా తుఫాన్ నష్టంపై అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నీట మునిగిన పంటలను ఏ మేరకు కాపాడగలమో చూడాలన్నారు. దీనిపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు అధ్యయనం చేయాలని అన్నారు. పంట మట్టిపాలు కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవచ్చో ఆలోచించాలన్నారు. కొబ్బరి చెట్లు సహా వివిధ ఉద్యాన పంటలకు చెందిన చెట్లు, మొక్కలను తిరిగి ప్లాంట్ చేయగలిగే పరిస్థితులు ఉన్నాయా అనే అంశాన్నీ పరిశీలించాలని సూచించారు. తుఫాన్ బాధిత వ్యవసాయ, ఉద్యాన రైతులకు వాటిల్లిన నష్టాన్ని భర్తీ చేయడానికి వివిధ స్కీంలను వర్తింపజేయాలన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ స్థితి నెలకొనేంత వరకు ప్రభుత్వ యంత్రాంగం అండగా నిలవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేసే పనులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలపాలని.. అప్పుడే ప్రజల నుంచి సహకారం లభిస్తుందన్నారు. త్వరితగతిన పంట నష్టం అంచనాలను సిద్ధం చేసేందుకు టెక్నాలజీని వినియోగించాలని టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ఎంపీటీసీ అభ్యర్థి కౌసల్య ఇంటింటి ప్రచారం

గ్లోబల్ వార్త రామచంద్రాపురం(తిరుపతి):




ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అంటేనే ప్రచార హోరు, వ్యూహాలు, ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం వంటివి ఉంటాయి. కానీ, తిరుపతి జిల్లాలో మాత్రం నాయకులు సరికొత్త ట్రెండ్‌కు తెరతీశారు. గెలుపోటములను ఓటర్ల తీర్పు కంటే.. అదృష్ట దేవత ఎవరిని కరుణిస్తుందనే దానిపై ఆధారపడేలా చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఓ ఎంపీటీసీ స్థానాన్ని నాణెం నిర్ణయించడంతో కూటమిలో ఇరువర్గాల మధ్య పోటీ లేకుండా, పార్టీ పెద్దల సమక్షంలో విచిత్ర రాజకీయ డ్రామా జరిగింది. వివరాలు.. రామచంద్రాపురం మండలం అనుపల్లె టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి ఎంపిక కోసం పార్టీ నాయకులు తర్జనభర్జన పడ్డారు. మంగళవారం జరిగిన తుది జాబితా ప్రక్రియలో ఇరువురు అభ్యర్థులను ఒప్పించేందుకు నాయకులు తలలు పట్టుకున్నారు. ఈ స్థానం కోసం ఏకంగా ఐదుగురు ఆశావహులు నామినేషన్లు వేయడంతో గందరగోళం ఏర్పడింది. అయితే, పార్టీ పెద్దల జోక్యంతో ముగ్గురు తప్పుకోవడంతో బరిలో కుమ్మర కౌసల్య, జిల్లా సౌందర్య మాత్రమే మిగిలారు. సాధారణంగా కూటమి రాజకీయాల్లో టికెట్ల కేటాయింపుపై సుదీర్ఘ చర్చలు, సర్వేలు జరుగుతాయి. కానీ, ఇక్కడ ఇరువర్గాల మధ్య గట్టి పోటీ ఉండటంతో, పార్టీ పెద్దలు ఒక ప్లాన్ వేశారు. అదే ఓటర్ల వద్దకు వెళ్లకుండానే నేరుగా బొమ్మా బొరుసు ఆట ఆడించారు. ఎవరి బలం, ఏరియా పట్టు వంటి కనీస అర్హతలను పక్కన పెట్టి.. పెద్దల ఆధ్వర్యంలో గాలిలో నాణెం వేశారు. అది కాస్తా బొమ్మ పడడంతో కుమ్మర కౌసల్యను అభ్యర్థిగా ఖరారు చేశారు. ఎమ్మెల్యే పులివర్తి నాని స్వయంగా ఆమెకు బీఫారమ్ అందజేశారు.

రోడ్ల పరిస్థితిని బట్టి ఆర్టీసీ బస్సుల పునరుద్ధరణ

మంత్రి మండిపల్లి

గ్లోబల్ వార్త - అమరావతి



అర్నబ్ తుఫాన్ ప్రభావంతో నిలిచిన ఆర్టీసీ బస్సులను రోడ్ల పరిస్థితిని పరిశీలించిన అనంతరం పునరుద్ధరిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు రవాణా సదుపాయాలను పునరుద్ధరించేందుకు ఆర్టీసీ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. ఇప్పటికే విజయవాడ నుంచి ఏలూరు, రాజమండ్రి వైపు బస్సు సర్వీసులు ప్రారంభమైనట్లు తెలిపారు. తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. తుఫాన్ ప్రభావం తగ్గి రోడ్లు సాధారణ స్థితిలో ఉన్న ప్రాంతాలలో ప్రయాణానికి అనుకూలంగా ఉన్నాయని నిర్ధారించిన వెంటనే బస్సు సర్వీసుల కొనసాగించాలని మంత్రి ఆదేశించారు. బస్సుల పునరుద్ధరణపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. ఆర్టీసీ రవాణా వ్యవస్థను త్వరితగతిన సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు.

గురుకులం బాయ్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక



గ్లోబల్ వార్త - పులివెందుల

పులివెందుల బెస్తవారిపల్లి నందు గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పులివెందుల బాయ్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో గురుకుల విద్యార్థులు సెలెక్ట్ కావడం చాలా సంతోషం దీనికి కళాశాల ప్రిన్సిపాల్ సి.నరసింహులు మరియు వైస్ ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. సోమవారం మరియు మంగళవారం జరిగిన వంటి ఎస్ జి ఎఫ్ స్కూల్ గేమ్స్ కడప జిల్లాలో మునిసిపల్ స్టేడియం జరిగిన వంటి ఖో ఖో , కబడ్డీ పోటీలలో ఈ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు సెలెక్ట్ కావడం జరిగిందని, ఎస్ జి ఎఫ్ అండర్ 14 ఖోఖో లో ఐదు మంది విద్యార్థులు వెంకటకృష్ణ, సునీల్, అభిచరణ్, మాధవ్, మహేష్ రాష్ట్రస్థాయికి సెలెక్టర్ కావడం జరిగింది. ఎస్జిఎఫ్ అండర్ 17 ఖోఖోలో నలుగురు విద్యార్థులు సాయికృష్ణ, హేమంత్, హర్ష వర్ధన్, సజీవరాజ్ రాష్ట్రస్థాయికి సెలెక్ట్ కావడం జరిగింది. ఎస్జిఎఫ్ అండర్ 17 కబడ్డీ పోటీలలో మనోజ్, హర్షవర్ధన్, అనుదీప్, నరేంద్ర రాష్ట్రస్థాయికి సెలెక్ట్ కావడం జరిగింది. ఎస్జిఎఫ్ అండర్ 14 కబడ్డీ పోటీలలో శ్రుతి కీర్తన్ రాష్ట్రస్థాయికి సెలెక్ట్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పిడి బి.రామిరెడ్డి పిటి డి.సురేంద్ర ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.


ప్రజల మద్దతుతో కూటమి విజయం ఖాయం

మారెడ్డి జయ భరత్ రెడ్డి!

గ్లోబల్ వార్త -లింగాల



లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి సతీమణి, లింగాల మండల జడ్పీటీసీ కూటమి అభ్యర్థి యమ్మనూరు సరళ దేవి విజయమే లక్ష్యంగా అంబకపల్లె గ్రామంలో కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రిపురం జడ్పీటీసీ సభ్యుడు మారెడ్డి జయ భరత్ రెడ్డి పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ , లింగాల మండల టీడీపీ ఇంచార్జ్ దేవిరెడ్డి సంజీవ రెడ్డి పాల్గొన్నారు. గ్రామం లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకుంటూ, కూటమి అభ్యర్థి యమ్మనూరు సరళదేవికి మద్దతు తెలిపి ఘనవిజయం అందించాలని కోరారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లో, పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి సహకారంతో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం గా.. కూటమి అభ్యర్థి యమ్మనూరు సరళ దేవి గారిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. అభి వృద్ధి కొనసాగాలి.. సంక్షేమం ప్రతి ఇంటికి చేరాలి.. కూటమి అభ్యర్థులు గెలవాలని అభ్యర్థించారు.



వరదారెడ్డి కుమారుని వివాహ వేడుక

గ్లోబల్ వార్త - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు జి.వి.ఎస్.ఆర్ కన్వెన్షన్ హాల్‌లో సూరన్నగారి వరదారెడ్డి కుమారుని వివాహ వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి చిత్రంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసుల రెడ్డి, మాలేపాడు బాబు,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



అనాథ పిల్లలకు అండగా 'అమ్మవడి'

గ్లోబల్‌వార్త - కడప

అనాథ పిల్లలను ఆదుకుంటూ వారికి అండగా నిలుస్తున్న 'అమ్మవడి' అనాథ ఆశ్రమానికి పలువురు దాతలు, రెవెన్యూ ఉద్యోగులు తమ వంతు సహకారం అందిస్తున్నారు. రెవెన్యూ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఆశ్రమం నిర్వహణకు ఉద్యోగులు, దాతలు సహకరిస్తూ అనాథ పిల్లల సంక్షేమానికి తోడ్పడుతున్నారు. ఈ క్రమంలో చాపాడు తహసీల్దార్ రమాదేవి అమ్మవడి అనాథ ఆశ్రమాన్ని సందర్శించి, పిల్లల అవసరాల కోసం ఐదు ప్యాకెట్ల బియ్యాన్ని అందజేశారు. భవిష్యత్తు లోనూ అమ్మవడి ఆశ్రమానికి తన వంతు సహకారం అందిస్తానని ఆమె తెలిపారు. అనాథ పిల్లల సంక్షేమం కోసం ముందుకొచ్చి సహాయం అందించిన తహసీల్దార్ రమాదేవికి రెవెన్యూ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు దాతలు, ఉద్యోగులు మరింత సహకారం అందించాలని వారు కోరారు.

తపాలా ఓటు కోసం ఎన్నికల సిబ్బంది దరఖాస్తు చేసుకోవాలి..!

నమోదుకు 29వ తేదీ అవకాశం

గ్లోబల్ వార్త - కడప : జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తపాలా ఓటు కోసం ఈ నెల 27, 28, 29 తేదీల్లో అంతర్జాలం ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడం జరిగిం దని, అందుకు ఈ నెల 29 చివరి రోజు కావడంతో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని.. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సుబ్రమణ్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిబ్బంది రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణ వ్యవస్థ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. తమ మొబైల్ నెంబర్ తో నమోదు చేసుకుని, తొలిసారి ప్రవేశించేటప్పుడు అనే ముందుగా నిర్ణయించిన సంకేత పదాన్ని ఉపయోగించాలి. ప్రవేశించిన వెంటనే సంకేత పదాన్ని మార్చుకుని, అనంతరం తపాలా ఓటు కోసం దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని సుబ్రమణ్యం సూచించారు.

సత్యసాయి జిల్లాలో మంత్రి రాజకీయం

టీడీపీ గూటికి వైసీపీ అభ్యర్థులు



గ్లోబల్ వార్త - పెనుగొండ : జిల్లాలోని పెనుకొండ నియోజకవర్గంలో వైసీపీ తరఫున మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి దిగిన ఇద్దరు అభ్యర్థులు బీసీ సంక్షేమ శాఖామంత్రి సవిత కార్యాలయంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు మంత్రి సవిత రాజకీయ వర్గాల దృష్టిని ఆకర్షించారు.జిల్లాలోని పెనుకొండ నియోజకవర్గంలోని 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా వైసీపీ నుంచి పోటీ చేస్తున్న గుణ, 20వ వార్డు కౌన్సిలర్‌గా వైసీపీ తరఫున పోటీ చేస్తున్న గాయత్రి.. ఇద్దరు వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు గుణ, గాయత్రి తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సవిత కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం మంత్రి వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీ లోకి ఆహ్వానించారు. పెనుకొండలో మంత్రి సవిత చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీ లో చేరామంటూ వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థులు తెలిపారు. ఈ మేరకు మంత్రి సవితపై రాజకీయ వర్గాలు ప్రశంసలు కురిపిస్తున్నాయి.



వైసీపీవి అసత్య ప్రచారాలు

విశాఖకు కూటమి ఏం చేసిందో చెబుతాం:ఎంపీ శ్రీభరత్

గ్లోబల్ వార్త - విశాఖపట్నం

వీఎంసీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా జరుగుతోందని, మొత్తం120 వార్డుల నుంచి కూటమి అభ్యర్థులు పోటీ చేస్తున్నట్లు ఎంపీ శ్రీభరత్ తెలిపారు. జీవీఎంసీ మేయర్ అభ్యర్థిగా ముక్క శ్రావణి పోటీ చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు తమపై బురద జల్లుతున్నారని ఎంపీ మండిపడ్డారు. విశాఖకు కూటమి ఏమీ చేయ లేదని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడపడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్యాకేజీని తెచ్చామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో స్టీల్ ప్లాంట్‌కు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేశామన్నారు. విశాఖ వేదికగా మూడు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మాణం జరుగుతున్నా యని.. అనేక ఐటీ కంపనీలు విశాఖకు వస్తున్నాయ్నారు. స్టార్ హోటల్స్ విశాఖలో ఏర్పాటు అవుతున్నట్లు చెప్పారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో మురికి వాడల తొలగించి గ్రూప్ హౌస్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. వైసీపీ విశాఖకు చేసిందేమీ లేదని.. గతంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వలేదని విమర్శిం చారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత లబ్ధిదారులకు ఇళ్లు అందజేశా మన్నారు. సెల్ వైజాగ్ అని వైసీపీ అనడం హాస్యా స్పదమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అనేక ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టారని ఆరోపించారు. మద్యం లేకుండా చేస్తామని చెప్పి నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ప్రాణాలు తీశారని మండి పడ్డారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 11 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని వ్యాఖ్యానిం చారు. ఋషికొండను బొడిగుండు చేసిన వైసీపీ పర్యావరణంపై మాట్లాడటం హాస్యాస్పద మన్నా రు. విశాఖలో త్రాగునీటి సమస్య లేకుండా చర్య లు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో తుఫాన్‌ను సమర్థ వంతంగా ఎదుర్కొన్నామని అన్నారు. తుఫాన్ వలన ఏపీలో ఐదుగురు మృతి చెందడం బాధా కరమని.. వీరిలో ఇద్దరు విశాఖకు చెందిన వారు ఉన్నారని తెలిపారు. మృతుల కుటుం బాలకు ప్రభుత్వం రూ.5 లక్షలు నష్టపరిహారం ప్రకటించినట్లు ఎంపీ వెల్లడించారు.

అనంతపురం జిల్లాలో టీడీపీ క్లీన్‌స్వీప్.. మూడు జడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవం

గ్లోబల్ వార్త - అనంతపురం



అనంతపురం జిల్లాలో ఏకగ్రీవాలు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే గుమ్మ నూరు జయరాం ఆధ్వర్యంలో గుంతకల్లులో టీడీపీ క్లీన్ స్వీప్ చేసింది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో అనంతపురం జిల్లాలో ఏకగ్రీవాలు జోరందుకున్నాయి. ఇప్పటికే గుత్తి మున్సిపాలిటీ చైర్మన్ పదవి, 27 వార్డు స్థానాలు ఏకగ్రీవం కాగా.. గుంతకల్లు నియోజకవర్గం కూడా అదే బాట పట్టింది. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో.. టీడీపీ గుంతకల్లును క్లీన్‌స్వీప్ చేసింది. గుంతకల్లు నియోజకవర్గంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఈ మేరకు గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు వందశాతం కూటమి ఖాతాలో చేరాయి. గుత్తి జడ్పీటీసీ సభ్యురాలిగా నల్లబోతుల స్వాతి, గుంతకల్లు జడ్పీటీసీ సభ్యురాలిగా డి. గీత, పామిడి జడ్పీటీసీ సభ్యుడిగా పల్లె శ్రీనివాసులు ఎన్నికను ధ్రువీకరిస్తూ.. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జడ్పీ సీఈఓ విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా పరిషత్ విడిపోయిన తరువాత జరిగిన ఎన్నికల్లో తొలిసారిగా ముగ్గురు జడ్పీటీసీలు ఏకగ్రీవంగా ఎన్నికవడం ఇదే తొలిసారి.

ప్రవీణ్ కుమార్ మామకు పుత్తా నివాళి

గ్లోబల్ వార్త - కడప



నియోజకవర్గంలోని చింతకొమ్మాదిన్నే మండలం కార్పొరేషన్ పరిధిలో చంద్ర ప్రతాప్‌కాలని లోని ప్రవీణ్ కుమార్ మామ గారు మరణించడంతో వారి మృతదేహానికి పూల మాల వేసి నివాళి అర్పించిన పుత్తా నరసింహా రెడ్డి గారు నాయకులు

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలన

గ్లోబల్ వార్త - కడప



కడప నగరంలోని మునిసిపల్ ఉన్నత పాఠశాల (మెయిన్)లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ టి. భవాని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అర్హులైన సిబ్బందికి కల్పించిన సౌకర్యాలు, కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లు, భద్రతా చర్యలను ఆమె పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, క్రమశిక్షణ, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు. కడప టూ టౌన్ సి.ఐ శ్రీహరి, రూరల్ సి.ఐ ఎస్.కె రోషన్, టూ టౌన్ ఎస్.ఐ కొండారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మూడు పల్లెల రైతులను రాత్రంతా పరుగులు పెట్టించిన గజరాజు

డ్రోన్ విజువల్స్‌తో అప్రమత్తం చేసిన అటవీశాఖ సిబ్బంది



ఎర్రావారిపాలెం(తిరుపతి): రెండు మండలాల పరిధిలోని మూడు పల్లెల రైతులను ఓ మదపు టేనుగు మంగళవారం రాత్రంతా పరుగులు పెట్టించింది. నల్లటి ఆకారంలో మంద నుంచి నెట్టివేయబడ్డ మదపుటేనుగు టార్చిలైట్‌ల వెలుగులో మీదకు దూసుకురావడంతో పంట పొలాలను కాపాడు కునేందుకు వెళ్లిన రైతులు ప్రాణభీతితో పరుగులు తీశారు. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల పంచాయతీ తుమ్మసేను పల్లెకు చెందిన సిద్ధమ్మకు చెందిన వరిపంటను మంగళవారం రాత్రి మదపు టేనుగు ధ్వంసం చేసింది. దేవరకొండ గ్రామం తూమువాని కుంట కింద సాగుచేసిన రామయ్య వరి పంట పై దాడిచేసింది. పక్కనే ఉన్న వేరుశనగ పంట నుతిని ధ్వంసం చేసింది. పంటల పైకి రాకుం డా నిలువరించేందుకు వంగుమళ్లవారి పల్లె రైతులు 50మంది దాన్ని తరిమేందుకు ప్రయ త్నించారు. అయితే అది తిరగబడుతూ టార్చిలైట్ వెలుతురులో రైతులపైకి దూసుకు రావడంతో వారంతా పరుగులు తీశారు. వారితో పాటే గజరాజు కూడా ఊరిలోకి వచ్చింది. రైతులు ట్రాక్టర్ల శబ్దంతో తరిమారు. దీంతో పక్కనే ఉన్న మల్లెల వాండ్లపల్లె ఇండ్ల వెనుకకు చేరింది. అక్కడ కూడా రైతులు గుమికూడి టపాసులు, భారీ శబ్దాలతో బెదిరించేదుకు ప్రయత్నించే కొద్దీ వారి మీదకు దూసుకొచ్చింది. ఎఫ్‌బీవో నిఖిల్ ఆధ్వర్యంలో ఫారెస్టు అధికారులు డ్రోన్ కెమెరాతో ఏనుగు కదలికలను ఎప్పటికప్పుడు తెలియ జేయడంతో రైతులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. బుధవారం వేకువజామున 4 గంటలకు ఎర్రావారి పాలెం మండలం పచ్చార వాండ్ల పల్లె సమీపం వరకు మదపు టేనుగును దారి మళ్లించారు. ఆ క్రమంలో ఇమాం హుసేన్, నాగ భూషణ పొలాల వద్ద ఉన్న గుడిసెలను నేలకూల్చింది. రాత్రంతా రెండు మండలాల్లోని మూడు పల్లెల్లో మదపు టేనుగు బీతావహ పరిస్థితి కల్పించింది. చీకట్లో ఏనుగు తరుము తుండడంతో పలువురు రైతులు తప్పించుకొనే క్రమంలో కింద పడటంతో స్వల్ప గాయాల య్యాయి. ఫారెస్టు అధికారులు డ్రోన్ కెమెరాలతో కదలికలు చెప్పడంతో ప్రాణాలతో బయట పడ్డారు. ఎట్టకేలకు 11 ఏనుగులు వెళ్లిన ఎలిఫెంట్ కారిడార్ మార్గంలో మదపుటేనుగు చింత గుంట పంచాయతీ సమీపంలో తిష్ఠ వేసింది.



వేంపల్లిలో జడ్పీటీసీ వైఎస్ఆర్సీపి ఎన్నికల ప్రచారం

గ్లోబల్ వార్త - వేంపల్లి

అంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభించిన వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి జడ్పీటీసీ అభ్యర్థి వెంకట శివమ్మను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించిన సతీష్ రెడ్డి,ఆయన తమ్ముడు వేంపల్లి మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి లు వైఎస్సార్సీపీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ముమ్మరంగా ఎన్నికల ప్రచారం వేంపల్లి పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్ల మద్దతు కోరుతున్న వైఎస్సార్సీపీ నాయకులు సతీష్ రెడ్డి కామెంట్స్ రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులను ప్రజలు గమనించాలి రాష్ట్ర ప్రభుత్వం అధికారులను అడ్డం పెట్టుకుని దుర్వినియోగానికి పాల్పడేలా చేస్తోందని విమర్శ ఇదే ప్రక్రియ కొనసాగితే రాష్ట్రంలో ప్రజల ఆస్తి, మాన, ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన చంద్రబాబు నిర్వహిస్తున్న ప్రెస్‌మీట్లు చూస్తే జుగుప్స కలుగుతోందని సతీష్ రెడ్డి వ్యాఖ్య ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రజల ఆగ్రహం నుంచి తప్పించుకునేందుకే వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బురద చల్లుతున్నారని ఆరోపణ. ప్రజా సమస్యలను పక్కనపెట్టి జగన్ మోహన్ రెడ్డి కుటుంబ విషయాలు మాట్లాడే స్థాయికి చంద్రబాబు దిగజారారని విమర్శ. తన స్థాయిని మరిచి వ్యక్తిగత విమర్శలకు దిగడం దుర్మార్గమని చంద్రబాబుపై సతీష్ రెడ్డి మండిపాటు వైఎస్ జగన్ కుటుంబానికి సంబంధించిన అంశాలు కొన్ని పత్రికల్లో ప్రధాన శీర్షికలుగా మారుతున్నాయని వ్యాఖ్య చంద్రబాబు నాయుడు కుటుంబం గురించి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎప్పుడైనా మీడియా సమావేశంలో మాట్లాడారా? అని ప్రశ్న వైఎస్ జగన్ చెల్లెలి హక్కుల గురించి మాట్లాడే ముందు తన కుటుంబ వ్యవహారాలను పరిశీలించుకోవాలని చంద్రబాబుకు సూచన కుటుంబ ఆస్తుల గురించి మాట్లాడేందుకు చంద్రబాబుకు ఏ అర్హత ఉందని సతీష్ రెడ్డి సూటి ప్రశ్న అహంకారం, నియంతృత్వ ధోరణితో లోకేష్ పాలిస్తుంటే చంద్రబాబు కల్లులేని కబోది లా చూస్తున్నారని తీవ్ర విమర్శ తన కుమారుడు చేస్తున్న పనులకు చంద్రబాబు బాధ్యత వహిస్తున్నారని వ్యాఖ్య ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అధికారులు ప్రజలకు సహకరించాలి నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న అధికారులకు నా సెల్యూట్: సతీష్ రెడ్డి



ప్రచారంలో కమలాపురం ఎమ్మెల్యే

గ్లోబల్ వార్త - పులివెందుల స్థానిక ఎన్నికల సందర్భంగా ఈరోజు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ, ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ, స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరిన కమలాపురం శాసన సభ్యులు పుత్తా. కృష్ణ చైతన్య రెడ్డి



మైదానంలో మెరిసిన మణిపూసలు

గ్లోబల్ వార్త– నెల్లూరు జిల్లా, ఇందుకూరుపేట: క్రీడా మైదానంలో నరసాపురం పాఠశాల బాలికలు తమ ప్రతిభను చాటుకున్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–14 బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించారు. పరుగు పందేలు, లాంగ్ జంప్‌లో సత్తా చాటుతూ పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారు. జిల్లా స్థాయి పోటీల్లో నరసాపురం పాఠశాలకు చెందిన సంజన 100, 200 మీటర్ల పరుగు పందేల్లో ప్రథమ స్థానాలు సాధించింది. నాగలక్ష్మి 400, 600 మీటర్ల పరుగు పందేల్లో విజేతగా నిలిచింది. లాంగ్ జంప్ విభాగంలో ప్రసన్న మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, శశికళ తృతీయ స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచింది. విద్యార్థినులు క్రమశిక్షణతో సాధన చేసి పోటీల్లో విజయాలు సాధించడం పాఠశాల వర్గాల్లో ఆనందాన్ని నింపింది.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ మీట్, అండర్–17 పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థినుల ప్రతిభను అభినందిస్తూ, వారి విజయానికి కృషి చేసిన శిక్షకుడిని ప్రశంసించారు. రాజమండ్రిలో జరగనున్న తదుపరి పోటీల్లోనూ నరసాపురం పాఠశాల విద్యార్థినులు విజయాలు సాధించి పాఠశాలకు మరింత పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. విద్యార్థినుల విజయంతో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్నబ్ తుపాను ఎఫెక్ట్

సముద్రంలో నిలిచిపోయిన ఫిలిప్పైన్స్ షిప్

గ్లోబల్ వార్త – పశ్చిమగోదావరి

'ఆర్నబ్' తుపాను సృష్టించిన బీభత్సాన్ని ఫిలిప్పైన్స్‌కు చెందిన ఓ మర్చంట్ షిప్ కూడా తట్టుకోలేకపోయింది. తుపాను దాటికి షిప్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో అంతర్వేది వద్ద సముద్రంలో నిలిచిపోయింది. ఈ మేరకు సమాచారం అందుకున్న కోస్ట్ గార్డ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. షిప్‌లో భారతీయులతో పాటు 24 మంది సిబ్బంది ఉన్నట్లుగా గుర్తించామని సంబంధిత అధికారులు వెల్లడించారు. తుపాను ప్రభావంతో షిప్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు సాంకేతిక సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో షిప్‌లో చిక్కుకున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. హెలికాప్టర్ సహాయంతో బాధితులను మొగల్తూరు హెలిప్యాడ్ వద్దకు తరలించేందుకు చర్యలు చేపట్టినట్లు కోస్ట్ గార్డ్ సిబ్బంది తెలిపారు.



ఓటమి భయం.. టీడీపీ ఎమ్మెల్యే ప్రలోభాలు

గ్లోబల్ వార్త – అనంతపురం: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ప్రలోభాలకు తెరతీశారు. తాగు నీటి సమస్య ఉందని దొడగట్ట గ్రామస్తులు.. రెండున్నర సంవత్సరాలుగా చెబుతున్నా ఎమ్మెల్యే పట్టించుకోలేదు. అయితే, స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఓటమి భయంతో టీడీపీ నేతలు బోరు వేయిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉందని వైఎస్సార్‌సీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. కొండాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేతలపై ఎమ్మెల్యే సురేంద్ర బాబు వర్గం దాడులకు తెగబడ్డారు. వైఎస్సార్‌సీపీ నేత ఆంజనేయులు బైక్‌కు నిప్పు పెట్టారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో టీడీపీ మూకలు రెచ్చిపోతున్నారు.

గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్‌కు భారీ షాక్..

ఒక్కరోజే రూ. 26 లక్షల కోట్ల సంపద ఆవిరి

టెక్ దిగ్గజం గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ ప్రకటించిన మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు వాల్‌స్ట్రీట్ నిపుణుల అంచనాలను అందుకోలేకపోవడంతో అమెరికా మార్కెట్లలో ఆల్ఫా బెట్ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బుధవారం ఫలితాల ప్రకటన తర్వాత ట్రేడింగ్‌లో కంపెనీ షేరు ధర దాదాపు 10శాతం నుంచి 11శాతం వరకు పడి పోయింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో ఏకంగా 280 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైంది. ఆల్ఫాబెట్ 3వ త్రైమాసిక ఫలితాల్లో కంపెనీ మొత్తం ఆదాయం వి127.58 బిలియన్లుగా నమోదైంది. ఇది గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 25శాతం వృద్ధి చెందినప్పటికీ, విశ్లేష కులు అంచనా వేసిన వి128.20 బిలియన్ల కంటే స్వల్పంగా తక్కువగా ఉంది. మౌలిక వసతులకు ఉన్న భారీ డిమాండ్ కార ణంగా గూగుల్ క్లౌడ్ ఆదాయం గతేడాదితో పోలిస్తే 103శాతం పెరిగి వి30.71 బిలియన్లకు చేరింది. అయితే, నికర లాభం లో క్షీణత కనిపించింది. విశ్లేషకులు ఒక్కో షేరుకు వి3.01 నుంచి వి3.02 వరకు వస్తుందని అంచనా వేయగా, వాస్తవానికి నమోదైనది వి2.12 మాత్రమే. గతేడాది లో వి34.98 బిలి యన్లుగా ఉన్న నికర లాభం ఈ త్రైమాసికం లో వి26.17 – వి26.47 బిలియన్లకు పడిపోయింది. కంపెనీ చేసిన ఇతర ఈక్విటీ పెట్టుబడులలో నిక రంగా సుమా రు వి8.66 బిలియన్ల మేర అన్‌రియలైజ్డ్ నష్టాలు నమోదు కావడం నికర లాభాన్ని దెబ్బతీసింది.రేసులో ముందుండటానికి డేటా సెంటర్లు, ప్రాసె సింగ్ చిప్‌లు ఇంకా, క్లౌడ్ మౌలిక వసతుల కోసం ఆల్ఫా బెట్ ఏకంగా వి51.36 బిలియన్ల మూల ధన వ్యయాన్ని ఖర్చు చేసింది. ప్రాజెక్టులు, హార్డ్‌వేర్ ఇన్వెం టరీపై పెట్టిన భారీ వ్యయం కారణంగా ఫ్రీ క్యాష్ ఫ్లో ఋణా త్మకంగా మారింది. పెట్టుబడులకు తగ్గట్టుగా సమీప కాలంలో ఊహించిన రీతిలో లాభాలు రాకపోవచ్చనే అనుమానాలు మార్కెట్‌లో వ్యక్తమ య్యాయి. గూగుల్ సెర్చ్, యూట్యూబ్ ప్రక టనల ద్వారా వచ్చిన ఆదాయం పెరిగినప్పటికీ, సర్వీసెస్ విభాగంలో వృద్ధి రేటు క్లౌడ్ స్థాయితో పోలిస్తే మందగించడం కూడా పెట్టుబడిదారులను నిరాశ పరిచింది. గూగుల్ క్లౌడ్, ఏఐ విభాగాల్లో ప్రతి ఏటా 25 శాతం రాబడి వృద్ధి నమోదైనప్పటికీ, స్పేస్ ఎక్స్ వంటి పెట్టు బడులపై నష్టాలు, ఏఐ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పై పెట్టిన భారీ వ్యయం వల్ల నికర లాభాలు ఊహించిన దానికంటే బాగా తగ్గి పోయాయి. దాంతో వాల్‌స్ట్రీట్ ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపడంతో ఆల్ఫాబెట్ షేర్లు భారీగా క్షీణించాయి.

తుఫాన్ బాధిత మత్స్యకారులకు అండగా మంత్రి

బోట్లు కోల్పోయిన మత్స్యకారులకు గొట్టిపాటి రవికుమార్ భరోసా

గ్లోబల్ వార్త – నరసాపురం

పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం అర్ణబ్ తుఫాన్ ప్రభావంతో బోట్లు కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన మత్స్యకారు లను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరా మర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం పొన్నపల్లిలో ఆయన పర్యటించి, తుఫాన్ కారణంగా నష్టపో యిన మత్స్యకారులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. ప్రకృతి వైపరీత్యం కారణంగా జీవనోపాధికి అవసర మైన బోట్లు కోల్పోయిన మత్స్యకారులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.తుఫాన్ ప్రభావంతో బోట్లు దెబ్బతినడం లేదా కోల్పోవడంతో మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేపల వేటపై ఆధారపడి జీవించే కుటుంబాలకు బోట్లు ప్రధాన జీవనాధారం కావడంతో వాటికి జరిగిన నష్టం వారి ఉపాధిపై ప్రభావం చూపుతోంది. ఈ నేప థ్యంలో పొన్నపల్లిలో పర్యటించిన మంత్రి బాధిత మత్స్యకారు లను పరామర్శించి, వారికి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. తుఫాన్ కారణంగా మత్స్యకారులకు జరిగిన నష్టాన్ని పరిశీ లించి, వివరాలను సేకరించాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించినట్లు సమాచారం. బాధితుల సమస్యలను గుర్తించి, వారికి అవసరమైన సహాయ చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మత్స్యకారులకు జరిగిన నష్టంపై సమగ్ర వివరాలు సేకరించి, ప్రభుత్వానికి నివేదించడం ద్వారా సహాయక చర్యలకు మార్గం సుగమం చేయాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో మత్స్యకారులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వారి సమస్యల పరిష్కారానికి



అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి పేర్కొన్నట్లు సమాచారం. బోట్లు కోల్పోయిన కుటుంబాలకు అవసరమైన సహాయం అందించే అంశంపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు.మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటనలో నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, నరసాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తూరు రామరాజు, మాజీ ఎమ్మెల్సీ, శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన మత్స్యకారుల సమస్యలను తెలుసుకున్నారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన మత్స్యకారులకు సకాలంలో సహాయం అందించడం, వారు తిరిగి జీవనోపాధిని కొనసాగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో మంత్రి పర్యటనతో బాధితుల సమస్యలు అధికారుల దృష్టికి వెళ్లాయి.

హత్యాయత్నం మరియు కార్ల దహనం కేసులో నలుగురు ముద్దాయిల అరెస్ట్

17.10.2026 వ తేదిన కడప టౌన్, గాంధీ నగర్ స్కూల్ దగ్గర మునిసిపల్ ఎలక్షన్స్ నామినేషన్స్ సందర్భంగా నామినేషన్ వేయడానికి వచ్చిన ఱఖా పార్టీ కి చెందిన వారిని, రాళ్లు, కట్టెలు, మరియు రాడ్లు తో కొట్టి గాయపరిచి, మూడు కార్లను ధ్వంసం చేసి రెండు కార్ల ను దహనం చేసిన కేసులో, కడప మాజీ డిప్యూటి మేయర్ నిత్యానంద రెడ్డి అనుచరులు అయిన నలుగురు వ్యక్తులను ఈదినం అనగా 29.10.2026 వ తేదిన కడప 1 టౌన్ తిమ్మారెడ్డి అరెస్ట్ చేసి రిమాండుకు తరలించడమైనది. ఈ కేసులో మిగిలిన ముద్దాయిలను అరెస్ట్ చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టడమైనది.

అరెస్ట్ కాబడిన ముద్దాయిల వివరాలు :

1.ఉటుకూరు సాయి గణేష్, వయస్సు 24 సం"లు, నివాసం ఇందిరానగర్, జ.ఖ. దిన్నె మండలం, కడప జిల్లా.

2.రామాపురం పుల్లయ్య, వయస్సు 55 సం"లు, నివాసం కందిపాలెం. ఎర్రముక్కపల్లి, కడప టౌన్.

3. కంచెర్ల వెంకట రమణ, వయస్సు 65 సం"లు, కందిపాలెం. ఎర్రముక్కపల్లి, కడప టౌన్.

4. నాగాదాసరి ప్రవీణ్, వయస్సు 20 సం"లు, కందిపాలెం. ఎర్రముక్కపల్లి, కడప టౌన్.



పోలింగ్ రిగ్గింగ్ ఆపాలి

తిరుపతిలో వైఎస్సార్‌సీపీ కార్పొరేషన్ అభ్యర్థులు నిరసన

గ్లోబల్ వార్త – తిరుపతి:

తిరుపతిలో వైఎస్సార్‌సీపీ కార్పొరేషన్ అభ్యర్థులు నిరసన చేపట్టారు. పోలింగ్ రోజు రిగ్గింగ్‌ని ఆపాలంటూ నిరసనకు దిగారు. తిరుపతిలో కూటమి ప్రభుత్వం పోలింగ్ రోజు రిగ్గింగ్‌కు పాల్పడే అవకాశం ఉందని.. నామినేషన్ వేసే క్రమంలో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై టీడీపీ గుండాలు దాడులకు పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలింగ్ రోజు రిగ్గింగ్ జరిగే అవకాశం ఉండడంతో ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసులు, అధికారులకు నిరసన ద్వారా వైఎస్సార్‌సీపీ విజ్ఞప్తి చేసింది. నిరసన కార్యక్రమంలో మేయర్ అభ్యర్థి వాసుదేవ యాదవ్, కార్పొరేట్ అభ్యర్థులు, తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన అభినయ్ రెడ్డి పాల్గొన్నారు. తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదని.. పారదర్శంగా ప్రక్రియ పూర్తి చేయాలని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థులను నామినేషన్లు వేయనీయ కుండా టీడీపీ గూండాలు చేసిన అరాచకాలకు పోలీసులు సహకరించారని.. కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ గూండాలు రిగ్గింగ్‌కు పాల్పడితే మళ్లీ కోర్టును ఆశ్రయించి వారికి సహకరించిన పోలీస్, ఎన్నికల అధికారులందరినీ న్యాయ స్థానం ముందు నిలబెడుతామని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ భూమన కరుణాకరరెడ్డి హెచ్చరించారు.



పూజారుల మధ్య పోస్టుల పంచాయితీ

గ్లోబల్ వార్త– పల్నాడు జిల్లా:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కోటప్పకొండలో పూజారుల మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఇటీవల దేవస్థానంలో నూతన పూజారుల నియామ కాల నేపథ్యంలో మొదలైన వివాదం ముదిరి, ప్రధాన పూజారులు రెండు వర్గాలుగా విడిపోయినట్లు తెలుస్తోంది. పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ భక్తుల ఎదుటే దూషణలకు దిగడం చర్చనీయాంశంగా మారింది. కోటప్పకొండ దేవస్థానంలో ఇటీవల చేపట్టిన నూతన పూజారుల నియామకాలపై ఒక వర్గం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఒకే కుటుంబానికి మూడు కొత్త పోస్టులు కేటాయించారంటూ ప్రత్యర్థి వర్గం ఆరోపిస్తోంది. ఈ నియామకాల వల్ల భవిష్యత్తులో దేవస్థాన నిర్వహణలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ అంశంపై ఇరు వర్గాల మధ్య మొదలైన విభేదాలు క్రమంగా పెరిగి, ప్రస్తుతం పరస్పర విమర్శలు, ఆరోపణలకు దారితీసినట్లు సమాచారం. ఆలయంలో పూజలు, దర్శనాల కోసం వచ్చే భక్తుల సమక్షంలోనే రెండు వర్గాల పూజారులు పరస్పరం దూషణలకు దిగినట్లు తెలుస్తోంది. దీంతో ప్రశాంతంగా దర్శనం చేసుకోవడానికి వచ్చిన భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. దేవస్థానంలో ఇలాంటి పరిస్థితులు నెలకొనడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, వివాదానికి పరిష్కారం చూపాలని కోరుతూ ఒక వర్గానికి చెందిన పూజారులు ఆలయంలోనే బైఠాయించినట్లు సమాచారం. దీంతో కోటప్పకొండలో పూజారుల మధ్య నెలకొన్న విభేదాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. పూజారుల మధ్య విభేదాలను సత్వరమే పరిష్కరించి, దేవస్థానంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని పలువురు కోరుతున్నారు. ఈ వివాదంలో టీడీపీ అధిష్ఠాన పెద్దలు జోక్యం చేసుకుని ఇరు వర్గాలతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడటంతో పాటు, కోటప్పకొండ దేవస్థానం ప్రతిష్ఠకు భంగం కలగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

28 ఏళ్లకే క్రికెట్‌కు గుడ్‌బై.. ఇకపై ఐటీ రంగంలో కొత్త బాధ్యతలు



సాధారణంగా 28 ఏళ్ల వయసు అంటే.. క్రికెట్‌లో యాక్టీవ్‌గాఉంటారు. అంతేకాక పలు రికార్డులను తమ ఖాతాలో వేసుకుంటారు. కొందరు మాత్రం క్రికెట్‌కు వీడ్కోలు చెబుతుంటారు. ఆ కోవాకు చెందిన ఆటగాడే ఐర్లాండ్ లెగ్ స్పిన్నర్ బెన్ వైట్. అతడు 28 ఏళ్ల వయసులోనే ప్రొఫెషనల్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాడు. ఇకపై పర్సోనియో అనే సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సంస్థ కొత్త బాధ్యతలు చేపట్టనున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. 'ఐర్లాండ్ తరఫున ఆడటం ఎంతో గర్వంగా ఉంది. అలానే మూడు ఫార్మాట్లలో దేశానికి ప్రాతినిధ్యం వహించడం, మూడు టీ20 ప్రపంచకప్‌ల్లో జట్టుతో కలిసి ఉండటం నా జీవితంలో మర్చిపోలేను. క్రికెట్ ద్వారా ఎన్నో జ్ఞాపకాలు, పాఠాలు, జీవితకాల స్నేహాలు లభించాయి' అని తన లింక్డ్‌ఇన్ ఖాతాలో పోస్ట్ చేశాడు. ఇక బెన్ వైట్ క్రికెట్ కెరీర విషయానికి వస్తే... అతడు 2021 జూలైలో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. ఐర్లాండ్ తరఫున మూడు ఫార్మాట్లలో కలిపి 43 మ్యాచ్‌లు ఆడాడు. గతేడాది డిసెంబర్‌లో చివరిసారిగా అంతర్జాతీయ మ్యాచ్‌లో పాల్గొన్నాడు. వైట్ ఎక్కువగా టీ20 ఫార్మట్‌లోనే రాణించాడు. 38 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 36 వికెట్లు సాధించాడు. 2021, 2024, 2026 టీ20 ప్రపంచకప్‌ల్లో ఐర్లాండ్ జట్టులో స్థానం సంపాదించాడు. 2023లో రెండు వన్డేలు, మూడు టెస్టులు ఆడాడు. బంగ్లాదేశ్‌తో టెస్టు అరంగేట్రంలో మూడు వికెట్లు తీసుకున్న అతడు.. ఆ తర్వాత శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల్లో ఒక్క వికెట్ మాత్రమే తీసి.. ఏకంగా 322 పరుగులు సమర్పించుకున్నాడు. బెన్ వైట్ రిటర్మెంట్‌పై ఐర్లాండ్ ప్రధాన కోచ్ గ్యారీ విల్సన్ స్పందించాడు. 'బెన్ అన్ని ఫార్మాట్లలో ఆడినప్పటికీ, అతడు టీ20 క్రికెట్ ద్వారానే ఎక్కువగా గుర్తింపు సంపాదించాడు. బౌన్స్ రాబట్టగల అతడి సామర్థ్యం, ??గొప్ప వేగంతో బౌలింగ్ చేయడం ప్రత్యర్థులకు సవాలుగా మార్చాయి. మూడు టీ20 ప్రపంచ కప్ జట్లలో చోటు దక్కించుకోవడం అతడి ప్రతిభకు నిదర్శనం' అని విల్సన్ పేర్కొన్నాడు.



న్యూజిలాండ్‌కు ఎదురుదెబ్బ..

భారత్‌తో చివరి రెండు టీ20లకు స్టార్ బౌలర్లు దూరం..

భారత్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్‌ను కష్టాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే తొలి మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన కివీస్ జట్టు మిగిలిన రెండింట్లో అయినా గెల వాలని కృత నిశ్చయంతో ఉంది. అయితే ఆ రెండు మ్యాచ్‌లకు ఇద్దరు స్టార్ బౌలర్లు అందుబాటులో లేకపోవడం కివీస్ గెలుపు అవకాశాలను దెబ్బతీసే అవకాశ ముంది. లాకీ ఫెర్గూసన్, మాట్ హెన్రీ గాయాల కారణంగా మిగిలిన రెండు టీ20లకు దూరమయ్యారు. వీరి స్థానం లో పేసర్ మాట్ ఫిషర్‌ను జట్టులోకి తీసు కున్నారు. లాకీ ఫెర్గూసన్, మాట్ హెన్రీ లకు స్వల్ప గాయాలయ్యాయి. ఫెర్గూసన్ కాలికి, హెన్రీ కుడి తొడకు గాయాల య్యాయి. వీరిద్దరూ పూర్తిగా కోలుకోవడా నికి ఒకటి నుంచి రెండు వారాల సమ యం పట్టవచ్చని వైద్యులు అంచనా వేశా రు. వన్డే సిరీస్ నాటికి వీరి ద్దరూ కోలు కు టారని న్యూజిలాండ్ యాజమాన్యం ఆశిస్తోంది. ఫెర్గూసన్ స్థానంలో మాట్ ఫిషర్‌ను మిగిలిన టీ20లకు ఎంపిక చేశారు. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌లను గెలిచిన భారత్ 3-0తో ఆధిక్యంలో ఉంది. నాలుగో టీ20 అక్టోబర్ 30న, ఐదో మ్యాచ్ నవం బర్ 1న జరగనుంది. ఆ తర్వాత నవం బర్ 4 నుంచి భారత్, న్యూజిలాండ్ మధ్య వన్డే సిరీస్ ప్రారం భమవుతుంది.

భారత జట్టులో హుసాముద్దీన్

గ్లోబల్ వార్త న్యూఢిల్లీ: ఫిన్లాండ్‌లో జరిగే తామెర్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టును బుధవారం ప్రకటించారు. 14 మంది సభ్యుల జట్టులో తెలంగాణ బాక్సర్ మహ్మద్ హుసాముద్దీన్‌కు చోటు దక్కింది. పురుషుల జట్టు: హుసాముద్దీన్ (60కి.), పవన్ బర్త్వాల్ (55కి.), వివేక్ మీనా (65కి.), హితేశ్ (70కి.), అక్షయ్ (80కి.), బోబిన్ చౌహాన్ (90కి.), చేతన్ (90ంకి.). మహిళల జట్టు: తను (51కి.), ఆర్తీ ధరియాల్ (54కి.), జాస్మిన్ (57కి.), దిశా విజయ్ (60కి.), అంకుషిత బోరో (65కి.), అరుంధతి చౌధరి (70కి.), ఇమ్రోజ్ ఖాన్ (75కి.).

హార్దిక్ కోసం 5 ఐపీఎల్ జట్లు.. కెప్టెన్సీపై అశ్విన్ కీలక వ్యాఖ్యలు..



భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఐపీఎల్ భవిష్యత్తుపై ఆసక్తికర చర్చ కొనసాగుతోంది. పాండ్యా ముంబై ఇండియన్స్‌ను వీడి మరో ఫ్రాంచైజీకి వెళ్లే అవకాశాలున్నాయన్న వార్తల నేప థ్యంలో ఐదు జట్లు అతడిపై ఆసక్తి చూపుతున్నాయని భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ వెల్లడించాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) హార్దిక్‌కు సరైన జట్టు కావచ్చని, అక్కడ అతడికి కెప్టెన్సీ చేసే అవకాశం కూడా దక్క వచ్చని అభిప్రాయపడ్డాడు. 'హార్దిక్ పాండ్యాను తీసుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్ ఆసక్తి చూపుతున్నాయి. అయితే నా అభిప్రాయం ప్రకారం హార్దిక్‌కు కేకేఆర్ సరైన జట్టు కావచ్చు. ఆ జట్టు తో చేరితే నాయకత్వ బాధ్యత కూడా వచ్చే అవకాశముంది. హార్దిక్‌ను తీసు కునే క్రమంలో కేకేఆర్ హర్షిత్ రాణా లేదా రింకూ సింగ్ వంటి ఆటగాళ్లను ట్రేడ్‌లో భాగంగా ముంబైకి ఇచ్చే అవ కాశం ఉంది. అయితే హార్దిక్ తదు పరి జట్టును ఎంచుకునేటప్పుడు కెప్టెన్సీ ఒక్క టే ప్రధాన షరతు కాక పోవచ్చు' అని అశ్విన్ పేర్కొన్నాడు. 'హార్దిక్ గతంలో గుజరాత్ టైటాన్స్‌కు కెప్టెన్‌గా వ్యవహ రించాడు. ఆ జట్టు నుంచి ముంబై ఇండియన్స్‌కు మారాడు. ఇప్పుడు గుజరాత్ టైటాన్స్ మళ్లీ ట్రేడ్ చర్చల్లోకి వస్తే, రషీద్ ఖాన్‌ను హార్దిక్‌కు బదులుగా ఇచ్చే అవకాశం ఉంది. ముంబై ఇండియన్స్‌కు బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసు కోవాల్సిన అవసరం ఉంది. హార్దిక్‌కు బదులుగా రషీద్ ఖాన్‌ను తీసుకోవడం ముంబై జట్టుకు మంచి ఆప్షన్' అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు.

మళ్లీ టాప్‌నకు అభిషేక్

టీ20 ర్యాంకింగ్స్

దుబాయ్: టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ మళ్లీ నెం:1 ర్యాంక్‌ను కైవసం చేసుకొన్నాడు. బుధవారం విడుదల చేసిన ఐసీసీ టీ20 బ్యాటర్ల తాజా జాబితాలో శర్మ ఓ మెట్టెక్కి అగ్ర స్థానానికి చేరుకోగా.. గాయంతో గత రెండు మ్యాచ్‌లకు దూరమైన ఇషాన్ కిషన్ మూడో ర్యాంక్‌కు పడిపోయాడు. ఫర్హాన్ (పాకిస్థాన్) రెండో ర్యాంక్ దక్కించుకొన్నాడు. న్యూజిలాండ్‌తో మూడో టీ20లో అభిషేక్ శతకం బాదడంతో అతడి ర్యాంక్ మెరుగు పడింది. కాగా, గత నాలుగేళ్లుగా టెస్ట్ ఆల్‌రౌండర్ ర్యాం కింగ్స్‌లో అగ్రస్థా నంలో కొనసాగుతున్న రవీంద్ర జడేజా తన నెం:1 ర్యాంక్‌ను కోల్పోయాడు. మార్కో యాన్సెన్ (దక్షిణా ఫ్రికా).. జడ్డును వెనక్కినెట్టి టాప్ ర్యాంక్‌ను సొంతం చేసుకొన్నాడు. టెస్ట్ బౌలర్ల జాబితాలో కూడా యాన్సెన్ అగ్ర స్థానాన్ని దక్కించుకోగా.. బుమ్రా ఐదో స్థానంలో ఉన్నాడు.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA, PRINTED AT LAKSHMI OFFSET PRINTERS, CHUTTUGUNTA, VIJAYAWADA AND PUBLISHED FROM VIJAYAWADA
D.NO. 28-2-22, II FLOOR, SHAIK MOHIDDEEN STREET, ARUNDELPET, VIJAYAWADA-520002. EDITOR DONDLAVAGU BHAVYA. PH . 08562-461571 APTEL/2025/16480